
సాక్షి ఆదిలాబాద్

బుధవారం । 28 । జూన్ । 2023



కడెం తీరం.. సోయగాల హారం

కడెం నది కవ్వాల్ టైగర్‌జోన్ పరిధిలో ప్రవహిస్తోంది. అడవుల గుండా వెళ్తూ.. రాళ్లపై సవ్వడులు చేస్తూ జలపాతాలు దూకుతూ గోదావరిలో కలుస్తోంది. 8లో▸

భారత్ ఎరువులు వచ్చేశాయ్



రసాయన ఎరువులన్నీ ఏకరూప సంచుల్లో భారత్ పేరుతో వస్తున్నాయి. సంచిపై 'ప్రధానమంత్రి జన్ ఉర్వరక్ పరియోజన' అని, సంచి కింద కంపెనీ వివరాలున్నాయి. 10లో▸

గరిష్టం/కనిష్టం
29.0/25.0

వాతావరణం

ఆకాశం మేఘావృతమై ఉంటుంది. గాలిలో తేమశాతం పెరుగుతుంది. జిల్లాలోని పలు ప్రాంతాల్లో వర్షం కురిసే అవకాశముంది.

న్యూస్‌రీల్

ఇందిరమ్మ కాలనీలో 'గడపగడపకూ కాంగ్రెస్'



కరపత్రం పంపిణీ చేస్తున్న సాజిద్‌ఖాన్

ఆదిలాబాద్‌టౌన్: పట్టణంలోని ఇందిరమ్మ కాలనీలో మంగళవారం 'గడపగడపకూ కాంగ్రెస్' కార్యక్రమాన్ని నిర్వహించారు. డీసీసీ అధ్యక్షుడు సాజిద్‌ఖాన్, ఏఐసీసీ సభ్యురాలు గండ్రత్ సుజాత, పార్టీ నాయకులు కాలనీలో ఇంటింటికీ తిరుగుతూ ప్రచారం చేశారు. సరూర్‌నగర్, వరంగల్ డిక్లరేషన్ల గురించి వివరించారు. కాంగ్రెస్ అధికారంలోకి వస్తే రైతులకు రూ.2లక్షల రుణమాఫీ, ఎకరాకు రూ.15వేల రైతుబంధు, రూ.500కు గ్యాస్ సిలిండర్, ఒకే కుటుంబంలో ఇద్దరు వృద్ధులుంటే రూ.5వేల పింఛన్ చెల్లిస్తామని హామీ ఇచ్చారు. నాయకులు నగేశ్, సంజీవ్‌రెడ్డి, నగేశ్ పాల్గొన్నారు.

మెడికోలకు శిక్షణ

ఆదిలాబాద్‌టౌన్: రిమ్స్‌లో 2019 బ్యాచ్‌కు చెందిన మెడికోలకు నెక్స్ట్ (ఎన్‌ఈఎక్స్‌టీ) స్టెప్–1, స్టెప్–2పై మంగళవారం సమావేశం నిర్వహించారు. ఢిల్లీ నుంచి ఎన్‌ఎంసీ చైర్మన్ వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ఎంబీబీఎస్ పూర్తి చేసిన తర్వాత తీసుకోవాల్సిన నిర్ణయాల గురించి వివరించారు. భవిష్యత్‌లో ఎలాంటి నిర్ణయాలు తీసుకోవాలి.. వైద్య విద్య, తదితర అంశాల గురించి వివరించారు. రిమ్స్ డైరెక్టర్ జైసింగ్ రాథోడ్, సూపరింటెండెంట్ అశోక్, వైస్ ప్రిన్సిపాల్ విద్యవిల్సన్, డాక్టర్ సంజయ్, ఇద్రిస్ అక్బాని పాల్గొన్నారు.

ఆర్టీసీ డ్రైవర్ నిజాయతీ



ల్యాప్‌టాప్ అందజేస్తున్న డీఎం కల్పన

ఆదిలాబాద్: ఆదిలాబాద్ డిపోకు చెందిన ఆర్టీసీ డ్రైవర్ గంగయ్య నిజాయతీ చాటుకున్నాడు. మంగళవారం ఉదయం హైదరాబాద్ నుంచి ఆదిలాబాద్ చేరుకున్న సూపర్ లగ్జరీ బస్సులో ల్యాప్‌టాప్‌ను డ్రైవర్ గంగయ్య గుర్తించి డిపోలో అందజేశాడు. బస్సులో దానిని మరిచిపోయిన జిల్లా కేంద్రంలోని హౌసింగ్ బోర్డ్ కాలనీకి చెందిన ప్రయాణికురాలి సోదరుడు తేజల్ డిపో అధికారులను సంప్రదించాడు. వివరాలు తెలుసుకున్న అనంతరం డిపో మేనేజర్ కల్పన అతడికి ల్యాప్‌టాప్ అందజేశారు. రిజర్వేషన్ ఇన్‌చార్జి హుస్సేన్ ఉన్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

ఉట్నూర్‌రూరల్: ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలోని ఆశ్రమ పాఠశాలలు, వసతి గృహాలు, పోస్ట్‌మెట్రిక్ వసతి గృహాల్లో ఏఎన్‌ఎంలుగా పని చేసేందుకు అర్హత, ఆసక్తి గల అభ్యర్థుల నుంచి ఆన్‌లైన్‌లో దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ఐటీడీఏ పీవో వరుణ్‌రెడ్డి ఓ ప్రకటనలో తెలిపారు. ఆదిలాబాద్ జిల్లాలో 66, కుమురం భీం ఆసిఫాబాద్ జిల్లాలో 50, మంచిర్యాల జిల్లాలో 18, నిర్మల్ జిల్లాలో 19.. మొత్తం 153 ఖాళీలు ఉన్నాయని పేర్కొన్నారు. అభ్యర్థులు https: tsobmms. cgg. gov. in వెబ్‌సైట్‌లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. పదో తరగతి/ఇంటర్‌తోపాటు 18 నెలల ఏఎన్ఎం ట్రైనింగ్ కోర్సు పూర్తి చేసి, గిరిజన సంక్షేమ పాఠశాలలో పనిచేసి ఉండాలని పేర్కొన్నారు. ఆసక్తిగల అభ్యర్థులు జూలై 3నుంచి 13వ తేదీ వరకు దరఖాస్తు చేసుకోవాలని, పూర్తి వివరాలకు గిరిజన సంక్షేమశాఖ కార్యాలయంలో సంప్రదించాలని సూచించారు.

ప్లాస్టర్ కోసం.. పడిగాపులు



ప్లాస్టర్ మార్పునకు నిరీక్షిస్తున్న రోగులు

ఆదిలాబాద్‌టౌన్: జిల్లా కేంద్రంలోని రిమ్స్ ఆస్పత్రిలో రోగులకు తిప్పలు తప్పడం లేదు. ప్రమాదాల్లో గాయాలపాలై ఇదివరకే ప్లాస్టర్ వేయించుకున్నవారు దానిని మార్చుకునేందుకు మంగళవారం ఆస్పత్రికి రాగా, సంబంధిత విభాగం తెరుచుకోలేదు. దీంతో వారు అక్కడే పడిగాపులు కాశారు. ఉదయం 10.30 గంటలు దాటినా ఎవరూ రాలేదు. తలమడుగు మండలం దేవాపూర్‌కు చెందిన దేవారెడ్డి, జిల్లా కేంద్రంలోని భగత్‌సింగ్‌కాలనీకి చెందిన ప్రవీణ్ అనే బాలుడు, మరికొంత మంది సుమారు గంటన్నర వరకు నిరీక్షించడం గమనార్హం.



తాంసి మండలం అంబుగాంలో విత్తనాలు వేస్తున్న కూలీలు

ఊరటనిచ్చింది..!

- మూడ్రోజులుగా కురుస్తున్న వాన
- సాగులో నిమగ్నమైన అన్నదాతలు
- సాగు అంచనా 5,75,250 ఎకరాలు
- అత్యధికంగా 3.76లక్షల ఎకరాల్లో పత్తి
- ఇప్పటికీ జిల్లాలో లోటు వర్షపాతమే..

1.6.22 నుంచి 1.5.23 వరకు వర్షపాతం ఇలా..	
సాధారణం:	1,199 మి.మీ.లు
కురిసింది:	1,727.9 మి.మీ.లు

నెలనెలా సాధారణ వర్షపాతం ఇలా..	
జూన్:	202.9 మి.మీ.లు
జూలై:	325.5 మి.మీ.లు
ఆగస్టు:	320.5 మి.మీ.లు
సెప్టెంబర్:	166.1 మి.మీ.లు

1.6.23 నుంచి 27.6.23 వరకు వర్షపాతం ఇలా..	
సాధారణం:	148.6 మి.మీ.లు
కురిసింది:	73.3 మి.మీ.లు
లోటు వర్షపాతం:	56 మి.మీ.లు

జిల్లాలో ఇప్పటివరకు సాగు విస్తీర్ణం
పత్తి: 1.86లక్షల ఎకరాలు
కంది: 16వేల ఎకరాలు
సోయాబీన్: 4,100 ఎకరాలు

సాక్షి, ఆదిలాబాద్: నైరుతి రుతుపవనాల రాక ఆలస్యమైనప్పటికీ జిల్లాలో మూడ్రోజులుగా కురుస్తున్న వానలు రైతులకు ఊరటనిచ్చాయి. దీంతో అన్నదాతలు సాగు పనుల్లో నిమగ్నమయ్యారు. మృగశిర కార్తె ప్రవేశంతోనే జిల్లాలో 40శాతానికి పైగా విత్తనాలు వేశారు. కురుస్తున్న వానలు విత్తనాలు మొలకెత్తేందుకు దోహదపడతాయన్న ఆనందం వారిలో కనిపిస్తోంది. నీటి వసతి ఉన్నవారు ముందుగా విత్తనాలు వేశారు. తాజాగా వానలు కురుస్తుండడంతో వర్షాధారంపై ఆధారపడ్డ రైతులు కూడా విత్తనాలు వేయడంలో బిజీగా మారారు. దీంతో చేలల్లో రైతులు, కూలీలు, ఎడ్లు, అరకలతో సందడి నెలకొంది.

లోటు వర్షపాతమే..

సాధారణంగా 60 మి.మీ.ల వర్షపాతం కురిసిన తర్వాత రైతులు విత్తనాలు వేసుకోవాలని వ్యవసాయాధికారులు, శాస్త్రవేత్తలు సూచిస్తున్నారు. మూడ్రోజులుగా జిల్లాలో వర్షాలు కురుస్తున్నప్పటికీ కొన్ని మండలాల్లోనే 60 మి.మీ.లు దాటి నమోదైంది. గాదిగూడ, నార్నూర్, ఇంద్రవెల్లి, గుడిహత్నూర్, ఆదిలాబాద్‌రూరల్, ఆదిలాబాద్‌అర్బన్, తాంసి, బోథ్, నేరడిగొండ, ఇచ్చోడ, సిరికొండ మండలాల్లో భూముల్లో తేమ కనిపిస్తోంది. మరో ఏడు మండలాల్లో ఇప్పటికీ వర్షాభావ పరిస్థితులే ఉన్నాయి.

సాగు విస్తీర్ణం ఇలా..

జిల్లాలో ఈ వానాకాలంలో 5,75,250 ఎకరాలు సాగవుతోందని వ్యవసాయశాఖ అంచనా వేసింది. ఇందులో అత్యధికంగా పత్తి 3.76లక్షల ఎకరాల్లో సాగు కానున్నట్లు పేర్కొంది. కాగా, ఇప్పటివరకు పత్తి 1.86లక్షల ఎకరాలు, కంది 16వేల ఎకరాలు, సోయాబీన్ 4,100 ఎకరాల్లో సాగైంది. రెండుమూడ్రోజులుగా వర్షాలు కురుస్తుండడంతో రైతులు చేలల్లో జోరుగా విత్తనాలు వేస్తున్నారు. పూర్తిస్థాయిలో సాగు అంచనాకు ఈ రెండుమూడ్రోజుల్లోనే చేరువయ్యే అవకాశం ఉంది.

'సేవా కార్యక్రమాలు నిర్వహించాలి'



ప్రధాని మోదీ కార్యక్రమాన్ని ఎల్‌ఈడీ స్క్రీన్‌పై వీక్షిస్తున్న బీజేపీ నాయకులు

ఆదిలాబాద్: ప్రతీ కార్యకర్త బూత్‌స్థాయిలో సేవా కార్యక్రమాలు నిర్వహించాలని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ పిలుపునిచ్చారు. మధ్యప్రదేశ్ రాజధాని భోపాల్‌లో నిర్వహించిన 'మేరా బూత్ సబ్ సే మజ్‌బూత్' కార్యక్రమంలో ఆయన పాల్గొని పార్టీ కార్యకర్తలనుద్దేశించి మాట్లాడారు. ఈ కార్యక్రమాన్ని జిల్లా కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో మంగళవారం ఎల్‌ఈడీ స్క్రీన్ ద్వారా నాయకులు వీక్షించారు. ప్రధాని మాట్లాడుతూ.. కేంద్రం అమలు చేస్తున్న కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని సూచించారు. బూత్ స్థాయిలో పార్టీని బలోపేతం చేయాల్సిన బాధ్యత కార్యకర్తలదేనని చెప్పారు. అనంతరం పార్టీ జిల్లా అధ్యక్షుడు పాయల్ శంకర్ మాట్లాడారు. పార్టీ సంస్థాగత అభివృద్ధే ధ్యేయంగా కార్యకర్తలు ముందుకువెళ్లాలని ప్రధాని మార్గనిర్దేశం చేసినట్లు చెప్పారు. రాష్ట్రంలో రాక్షస పాలన పోయి నిజాయతీగల బీజేపీ పాలన రావాలంటే క్షేత్రస్థాయి నుంచి కార్యకర్తలు పార్టీని బలోపేతం చేయాలని పిలుపునిచ్చారు. కాగా, బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు చిట్యాల సుహాసినిరెడ్డి జిల్లా కేంద్రంలోని కైలాసనగర్ కాలనీలోగల ఆమె నివాసంలో కార్యక్రమాన్ని వీక్షించారు. నాయకులు అంకత్ రమేశ్, ఆదినాథ్, జోగు రవి, దినేశ్ మటోలియా, చిలుకూరి జ్యోతిరెడ్డి, వేణుగోపాల్, ఆకుల ప్రవీణ్, ధోని జ్యోతి, మయూర్ చంద్ర, శ్రీనివాస్, రాజేశ్, సంతోష్ తదితరులు పాల్గొన్నారు.

'కేంద్రం నిధులు ఏమయ్యాయి?'



కరపత్రం పంపిణీ చేస్తున్న పాయల్ శంకర్

ఆదిలాబాద్: మున్సిపాలిటీలో క్షేత్రస్థాయిలో కనీస వసతులు కల్పించడం లేదని, పట్టణాభివృద్ధికి వెచ్చించిన రూ.వందల కోట్లు ఏమయ్యాయని బీజేపీ జిల్లా అధ్యక్షుడు పాయల్ శంకర్ ప్రశ్నించారు. మున్సిపాలిటీ పరిధిలోని భగత్‌సింగ్‌నగర్‌లో మంగళవారం నిర్వహించిన మహాజన్ సంపర్క్ అభియాన్ కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ఈ సందర్భంగా తొమ్మిదేళ్ల పాలనలో కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం అమలు జేస్తున్న పథకాలు, అభివృద్ధి గురించి ప్రజలకు వివరించారు. భగత్‌సింగ్‌నగర్ కాలనీవాసులు ఇండ్లు లేక ఇబ్బందులు ఎదుర్కొంటుంటే 'డబుల్ బెడ్రూం'లను ఎందుకు పంపిణీ చేయడంలేదని ప్రశ్నించారు. కాలనీలో నిరుపేదలు గుడిసెల్లో ప్రమాదకరంగా నివసించాల్సిన దుస్థితి ఏర్పడిందని తెలిపారు. సరైన రహదారులు, డ్రైనేజీలు, తాగునీటి వసతి లేక తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నట్లు వివరించారు. పట్టణాభివృద్ధికి రూ.వందల కోట్లు వెచ్చించామని చెబుతున్నా క్షేత్రస్థాయిలో అభివృద్ధి మాత్రం కనిపించడం లేదని విమర్శించారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం అనేక అభివృద్ధి, సంక్షేమ పథకాలను అమలు చేస్తోందని తెలిపారు. కార్యక్రమంలో రాష్ట్ర కార్యవర్గ సభ్యులు రత్నాకర్‌రెడ్డి, గిరిజన మోర్చా రాష్ట్ర అధికార ప్రతినిధి సాకటి దశరథ్, నాయకులు ముకుందరావు, మయూర్ చంద్ర, ధోని జ్యోతి, రాజు, గణేశ్, రవి తదితరులు పాల్గొన్నారు.

ఓటరు జాబితాలో పేర్లు సరిచూసుకోవాలి

- కలెక్టర్ రాహుల్‌రాజ్



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ రాహుల్‌రాజ్

కైలాస్‌నగర్: ఎన్నికలు సమీపిస్తున్న తరుణంలో వివిధ రాజకీయ పార్టీల నాయకులు ఓటరు జాబితాలో పేరు, చిరునామా సరిచూసుకోవాలని కలెక్టర్ రాహుల్‌రాజ్ సూచించారు. కలెక్టరేట్ సమావేశ మందిరంలో మంగళవారం ఆయా పార్టీల ప్రతినిధులతో సమావేశం నిర్వహించి ఓటరు జాబితాపై అవగాహన కల్పించారు. ఓటరు జాబితాలో పేర్లు లేని వారు ఫాం–6 ద్వారా మళ్లీ నమోదు చేసుకోవచ్చని తెలిపారు. ఎన్నికల సంవత్సరం నేపథ్యంలో ఇప్పటికే అన్ని ఏర్పాట్లు చేసినట్లు చెప్పారు. ఓటరు నమోదు, సమగ్ర ఓటరు జాబితా తయారు చేసినట్లు తెలిపారు. ఆగస్టు 31 వరకు అభ్యంతరాల స్వీకరణ, 21 సెప్టెంబర్ నాటికి డ్రాఫ్ట్ పబ్లికేషన్ చేయనున్నట్లు పేర్కొన్నారు. తుది జాబితాను అక్టోబర్ 4న ప్రకటిస్తామని తెలిపారు. ఎన్నికల్లో పోటీ చేసే అభ్యర్థి తన పేరు ఓటరు జాబితాలో ఉందో.. లేదో తెలుసుకోవాలని, నామినేషన్ చివరి తేదీ నుంచి పది రోజుల ముందు వరకు ఓటరు జాబితాలో పేరు నమోదు చేసుకునే అవకాశం ఉందని వివరించారు. ఎన్నికలు పకడ్బందీగా నిర్వహించేందుకు జిల్లా యంత్రాంగం అన్ని చర్యలు తీసుకుంటోందని పేర్కొన్నారు. అదనపు కలెక్టర్ నటరాజన్, అసిస్టెంట్ ట్రైనీ కలెక్టర్ శ్రీజ, ఆర్డీవో రమేశ్‌రాథోడ్ తదితరులు పాల్గొన్నారు.

ఆపరేషన్ ముస్కాన్‌ను పకడ్బందీగా నిర్వహిస్తాం



సమావేశంలో మాట్లాడుతున్న ఏఎస్పీ శ్రీనివాసరావు

ఆదిలాబాద్‌టౌన్: ఆపరేషన్ ముస్కాన్‌ను పకడ్బందీగా నిర్వహిస్తామని ఏఎస్పీ శ్రీనివాసరావు పేర్కొన్నారు. మంగళవారం జిల్లా పోలీస్ కార్యాలయంలో బాల కార్మికుల రక్షణపై జిల్లాస్థాయి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. బాలకార్మికులు, వీధి బాలలు, యాచకులు, అక్రమ రవాణాకు గురైన పిల్లలను రక్షించడమే లక్ష్యంగా కార్యక్రమాన్ని చేపట్టినట్లు తెలిపారు. ఏడాదికి రెండుసార్లు ఆపరేషన్ ముస్కాన్, ఆపరేషన్ స్మైల్ నిర్వహించి బడిబయట పిల్లల్ని బడిలో చేర్పిస్తామని, తప్పిపోయిన పిల్లలను తల్లిదండ్రుల చెంతకు చేర్చుతామని పేర్కొన్నారు. ఎవరైనా బాల కార్మికులను పనిలో పెట్టుకుంటే చట్టరీత్యా కేసులు నమోదు చేసి పిల్లలకు విముక్తి కలిగిస్తామని తెలిపారు. జూలై 1నుంచి నెలపాటు ఆపరేషన్ ముస్కాన్‌ను నిర్వహించనున్నట్లు తెలిపారు. అనంతరం డీసీపీవో రాజేంద్రప్రసాద్ మాట్లాడుతూ.. గతంలో జరిగినట్లుగానే ఈ ఏడాది కూడా ఆపరేషన్ ముస్కాన్‌ను పకడ్బందీగా చేపడతామని తెలిపారు. పిల్లలకు రిహాబిలిటేషన్ సెంటర్లు ఏర్పాటు చేసి వారి తల్లిదండ్రులకు కౌన్సెలింగ్ నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. సమావేశంలో సీడబ్ల్యూసీ చైర్మన్ వెంకటస్వామి, డీఎంహెచ్‌వో నరేందర్ రాథోడ్, లేబర్ ఆఫీసర్ జగదీశ్‌రెడ్డి, వినోద్, ఏటీడీవో సౌజన్య, సెక్టోరల్ అధికారి నారాయణ, ఉదయశ్రీ, చైల్డ్‌లైన్, 1098, మహిత స్వచ్ఛంద ప్రోగ్రాం మేనేజర్ శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

గ్రూప్–4 పరీక్షకు పకడ్బందీ ఏర్పాట్లు



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ రాహుల్‌రాజ్

కైలాస్‌నగర్: గ్రూప్–4 పరీక్షకు పకడ్బందీ ఏర్పాట్లు చేయాలని కలెక్టర్ రాహుల్‌రాజ్ సూచించారు. గ్రూప్–4 పరీక్షల నిర్వహణపై మంగళవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో సూపరింటెండెంట్లు, లైజన్ అధికారులు, రూట్ ఆఫీసర్లతో ముందస్తు సమావేశం నిర్వహించి మాట్లాడారు. జూలై 1న ఉదయం 10నుంచి మధ్యాహ్నం 12.30 గంటల వరకు పేపర్–1, మధ్యాహ్నం 2.30నుంచి సాయంత్రం 5గంటల వరకు పేపర్–2 ఉంటుందని తెలిపారు. పరీక్ష కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమలు చేయాలని, సమీప జిరాక్స్ సెంటర్లు మూసి వేయాలని ఆదేశించారు. కేంద్రాల వద్ద వైద్య సిబ్బంది అందుబాటులో ఉండాలని, పోలీసులు బందోబస్తు ఏర్పాటు చేయాలని సూచించారు. ఎలక్ట్రానిక్ పరికరాలు, సెల్‌ఫోన్లు, రైటింగ్ ప్యాడ్స్‌ను కేంద్రాల్లోకి అనుమతించరాదని పేర్కొన్నారు. కేంద్రాల అభ్యర్థులకు అన్ని వసతులు కల్పించాలని సూచించారు. విద్యుత్ అంతరాయం లేకుండా చూడాలన్నారు. అభ్యర్థులు సకాలంలో కేంద్రాలకు చేరుకునేలా ఆయా రూట్లలో బస్సులు నడపాలని ఆర్టీసీ అధికారులకు సూచించారు. కేంద్రాల వద్ద మెడికల్ కిట్లు, ఓఆర్ఎస్ ప్యాకెట్లతో ఏఎన్ఎం, ఆశ వర్కర్‌ను అందుబాటులో ఉంచాలని వైద్యారోగ్యశాఖ అధికారులకు తెలిపారు. అదనపు కలెక్టర్ ఎన్.నటరాజ్, ఆయా శాఖల అధికారులు పాల్గొన్నారు.

గ్రామీణ ప్రాంతాల్లో ఫినో బ్యాంక్ సేవలు



మాట్లాడుతున్న సౌత్ హెడ్ హిమాన్షు మిశ్రా

ఆదిలాబాద్‌టౌన్: జిల్లాలోని గ్రామీణ ప్రాంతాల్లో ఫినో బ్యాంక్ మొబైల్ సేవలు విస్తరించనున్నట్లు బ్యాంక్ సౌత్ హెడ్ హిమాన్షు మిశ్రా పేర్కొన్నారు. మంగళవారం పట్టణంలోని రాంనగర్‌లో మొబైల్ బ్యాంక్ సేవలు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. 60 రోజుల్లో కార్యకలాపాలు, ఆర్థిక పరిజ్ఞానం సేవలు ప్రజలకు అందుబాటులోకి తేనున్నట్లు పేర్కొన్నారు. జూన్ 27నుంచి ఆగస్టు 29వరకు రాష్ట్రంలోని 3వేల గ్రామాలకు సేవలు అందించనున్నట్లు తెలిపారు. మారుమూల గ్రామాల్లో నివసిస్తున్న వారికి బ్యాంకింగ్ సేవలు పూర్తిస్థాయిలో అందడం లేదని, వారందరికీ ఆర్థిక ప్రయోజనం చేకూరేలా చర్యలు చేపడుతున్నట్లు చెప్పారు. ఆర్థికంగా బలోపేతమయ్యేందుకు సేవలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. రాష్ట్రంలోని 33 జిల్లాల్లో 20వేల బ్యాంకింగ్ పాయింట్లు ఉన్నాయని తెలిపారు. ఖాతాలతో పాటు ఆధార్‌తో గ్రామస్తులకు సులభంగా ఆన్‌లైన్ బ్యాంకింగ్ అందిస్తున్నట్లు పేర్కొన్నారు. ఈ కేంద్రాల్లో ఆధార్, పాన్ కార్డు అప్లికేషన్ అప్‌డేట్ చేయనున్నట్లు తెలిపారు. డబ్బులు బదిలీ చేయడం, బిల్లులు చెల్లించడం, రీచార్జీలు, ఏటీఎం సేవలు అందించనున్నట్లు వివరించారు. జోనల్ హెడ్ ఇనాయత్, క్లస్టర్‌హెడ్ విశాల్ రెడ్డి, ఖుద్దూస్, అంకిత్ తదితరులున్నారు.

అరుణాచలానికి స్పెషల్ సూపర్ లగ్జరీ బస్సు

ఆదిలాబాద్: గురుపౌర్ణమిని పురస్కరించుకుని తమిళనాడు రాష్ట్రంలోని అరుణాచల గిరి ప్రదక్షిణ చేయాలనుకునే భక్తుల సౌకర్యార్థం ప్రత్యేక సూపర్ లగ్జరీ బస్సు నడపనున్నట్లు ఆర్టీసీ రీజినల్ మేనేజర్ జానీరెడ్డి మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. జూలై 3న జరిగే గిరి ప్రదక్షిణ టూర్ ప్యాకేజీ వివరాల కోసం భక్తులు సమీప డిపోల్లో సంప్రదించాలని పేర్కొన్నారు. పూర్తి వివరాలకు ఆదిలాబాద్ డిపోను 9959226002, నిర్మల్‌ను 9959226003, మంచిర్యాల డిపోను 9959226004 నంబర్లలో సంప్రదించాలని సూచించారు.

బీజేపీ ఇంటింటి ప్రచారం



కరపత్రం పంపిణీ చేస్తున్న నాయకులు

తలమడుగు: మండలంలోని సుంకిడి, లింగి గ్రామాల్లో మంగళవారం బీజేపీ ఆధ్వర్యంలో ఇంటింటి ప్రచారం నిర్వహించారు. పార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు నల్ల రత్నాకర్‌రెడ్డి, గిరిజన మోర్చా రాష్ట్ర అధికార ప్రతినిధి సాకటి దశరథ్ ఆయా గ్రామాల్లో ఇంటింటికీ తిరుగుతూ కరపత్రాలు పంపిణీ చేశారు. తెలంగాణ రాష్ట్ర అభివృద్ధి కోసం కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం దాదాపు రూ.5లక్షల కోట్ల నిధులు వెచ్చించిందని పేర్కొన్నారు. నాయకులు భువనగిరి స్వామి, కిరణ్, ధనంజయ, మనోహర్‌రెడ్డి, శ్రీకాంత్, ప్రభాస్, రవి, కైలాస్, నవీన్, అశోక్, వన్నెల లక్ష్మణ్, శశికాంత్ యాదవ్, నరేందర్, ప్రవీణ్, ఊషన్న తదితరులు పాల్గొన్నారు.

కార్యకర్తలు సైనికుల్లా పని చేయాలి

- జెడ్పీ చైర్మన్ రాథోడ్ జనార్దన్



గాదిగూడలో మాట్లాడుతున్న రాథోడ్ జనార్దన్

నార్నూర్: పార్టీ కోసం ప్రతీ కార్యకర్త సైనికుల్లా పనిచేయాలని జెడ్పీ చైర్మన్ రాథోడ్ జనార్దన్ పిలుపునిచ్చారు. మంగళవారం గాదిగూడ మండల కేంద్రంలో బీఆర్ఎస్ ముఖ్య కార్యకర్తలతో ప్రత్యేక సమావేశం నిర్వహించి మాట్లాడారు. ఈనెల 30న సీఎం కేసీఆర్ కుమురంభీం ఆసిఫాబాద్ జిల్లాకు రానున్న నేపథ్యంలో నిర్వహించే సభను విజయవంతం చేయడానికి భారీగా జన సమీకరణ చేయాలని సూచించారు. ప్రతీ గ్రామపంచాయతీ పరిధి నుంచి 100 నుంచి 200 మందిని తరలించేలా చూడాలన్నారు. ఎన్నో ఏళ్లుగా ఎదురుచూస్తున్న పోడు భూములకు సంబంధించిన పట్టాల పంపిణీ కార్యక్రమాన్ని సీఎం ఇక్కడి నుంచే ప్రారంభిస్తారని తెలిపారు. ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాల గురించి ప్రజలకు వివరించి ప్రతిపక్షాల విమర్శలను తిప్పికొట్టాలని పిలుపునిచ్చారు. 30న నిర్వహించే భారీ బహిరంగసభకు ఉదయం 9గంటలకే కార్యకర్తలు సభ స్థలానికి చేరుకోవాలని సూచించారు. ఆయన వెంట బీఆర్ఎస్ మైనార్టీ సెల్ రాష్ట్ర నాయకుడు యూనుస్ అక్బాని, ఎంపీపీ ఆడ చంద్రకళ రాజు, వైస్ ఎంపీపీ యోగేశ్, వివిధ గ్రామాల సర్పంచులు, ఎంపీటీసీలు పాల్గొన్నారు.

ఆంజనేయస్వామి ఆలయంలో పూజలు

ఎంపల్లి గ్రామంలోని ఆంజనేయస్వామి ఆలయంలో జెడ్పీ చైర్మన్ రాథోడ్ జనార్దన్ పూజలు చేశారు. ఆలయ అభివృద్ధికి పూర్తి సహకారం అందిస్తానని హామీ ఇచ్చారు. ఆయన వెంట వైస్ ఎంపీపీ జాదవ్ చంద్రశేఖర్, సర్పంచ్ రాథోడ్ గోవింద్‌నాయక్ తదితరులున్నారు.

రక్తదానం.. మహాదానం



రక్తదానం చేస్తున్న ఆర్ఎం జానీరెడ్డి

ఆదిలాబాద్: రక్తదానం.. మహాదానమని ఆర్టీసీ ఆర్ఎం జానీరెడ్డి పేర్కొన్నారు. ఆదిలాబాద్ డిపో గ్యారేజీలో మంగళవారం సంస్థ ఆధ్వర్యంలో మెగా రక్తదాన శిబిరాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆర్ఎం కూడా రక్తదానం చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. ప్రయాణికులను గమ్యస్థానాలకు చేర్చడంతో పాటు ఆర్టీసీ సామాజిక దృక్పథంతో సామాజిక సేవా కార్యక్రమాలు చేపడుతోందని తెలిపారు. రక్తదానం ఎంతో విలువైందని తెలియజేసేందుకే కార్యక్రమాన్ని చేపట్టినట్లు పేర్కొన్నారు. సంస్థ ఎండీ సజ్జనార్ ఆదేశాల మేరకు నిర్వహించిన కార్యక్రమానికి 30 మంది స్వచ్ఛందంగా రక్తదానం చేయడానికి ముందుకు రావడం అభినందనీయమని పేర్కొన్నారు. అనంతరం రక్తదాతలకు పండ్లరసం అందజేశారు. ఏవో పుల్లయ్య, డీఎం కల్పన, అసిస్టెంట్ మేనేజర్లు రాజేందర్, విశ్వనాథ్, సూపరింటెండెంట్ విలాస్, అకౌంటెంట్ మోహన్, డిస్పెన్సరీ వైద్యుడు భూమయ్య, రిజర్వేషన్ ఇన్‌చార్జి హుస్సేన్ తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

డ్రంకెన్‌డ్రైవ్‌లో 25మందికి జరిమానా

నిర్మల్‌టౌన్: మద్యం తాగి వాహనాలు నడిపిన 25మందికి జరిమానా, ఇద్దరికి మూడు, ఒక్కరికి ఐదు రోజుల సాధారణ జైలు శిక్ష విధిస్తూ నిర్మల్ న్యాయస్థానం తీర్పించినట్లు పట్టణ ట్రాఫిక్ ఎస్సైలు రాజశేఖర్, దేవేందర్ తెలిపారు. జిల్లా కేంద్రంలో మంగళవారం పోలీసులు వాహనాలు తనిఖీ చేపట్టారు. మద్యం మత్తులో వాహనం నడుపుతూ పట్టుబడిన వారిని నిర్మల్ కోర్టులో హాజరుపరిచారు. 25మందికి రూ.17,100 జరిమానా విధిస్తూ ద్వితీయ శ్రేణి న్యాయమూర్తి అజీజ్ రహేమాన్ తీర్పునిచ్చారు.

మాడిఫైడ్ సైలెన్సర్ల బైకులు పట్టివేత..
జిల్లా కేంద్రంలో షోరూం నుంచి వచ్చిన సైలెన్సర్లు కాకుండా మాడిఫైడ్ సైలెన్సర్ పెట్టుకొని ప్రజలకు ఇబ్బంది కలిగిస్తున్న బైకులను మంగళవారం పోలీసులు పట్టుకున్నారు. ఈ సందర్భంగా ట్రాఫిక్ ఎస్సైలు దేవేందర్, రాజశేఖర్ మాట్లాడారు. డీఎస్పీ జీవన్‌రెడ్డి ఆదేశాల ప్రకారం జిల్లా కేంద్రంలో స్పెషల్ డ్రైవ్ నిర్వహించామన్నారు. షోరూం నుంచి వచ్చిన సైలెన్సర్లు కాకుండా బైక్‌కు అధిక సౌండ్ వచ్చే సైలెన్సర్లను బిగిస్తే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అంతేకాకుండా వారిని ఆర్టీవోకు అప్పచెప్పడంతో రూ.5వేల నుంచి రూ.10వేల జరిమానా విధిస్తారని తెలిపారు. ప్రతి ఒక్కరూ జాగ్రత్త వహించాలని సూచించారు.

రజితపై మరో కేసు

ఆదిలాబాద్‌టౌన్: ఉద్యోగాల పేరిట నిరుద్యోగుల నుంచి డబ్బులు వసూలు చేసిన తోట రజితపై మరో కేసు నమోదు చేసినట్లు వన్ టౌన్ ఎస్సై అంజమ్మ తెలిపారు. ఉద్యోగాలు ఇప్పిస్తానని పది మంది నుంచి డబ్బులు వసూలు చేసి జైలు పాలు కాగా ఆదిలాబాద్ పట్టణంలోని శాంతినగర్‌కు చెందిన పి.సుజాత, జీడీసీ కాలనీకి చెందిన పి.గంగామణిలు సోమవారం ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేసినట్లు పేర్కొన్నారు. వీరికి ఉద్యోగాలు ఇప్పిస్తానని నమ్మించి సుజాత నుంచి రూ.2లక్షల 25వేలు, గంగామణి నుంచి రూ.30వేలు డబ్బులు కాజేసినట్లు వివరించారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు వివరించారు.

అటవీ అధికారులకు మనుబోతు అప్పగింత


మనుబోతును ఫారెస్ట్ అధికారులకు అప్పగిస్తున్న గ్రామస్తులు

ముధోల్: మండలంలోని ఎడ్‌బిడ్ గ్రామ శివారులో మంగళవారం మనుబోతు గాయాలపాలై గ్రామస్తులకు కనిపించింది. దీంతో గ్రామస్తులు సర్పంచ్ జాదవ్ ధూమ్‌నాయక్‌కు సమాచారం అందించగా అతడు పోలీసులకు, వెటర్నరీ అధికారులకు తెలిపాడు. వెటర్నరీ డాక్టర్ రాజేశ్వర్ సంఘటనా స్థలానికి చేరుకొని మనుబోతుకు ప్రథమ చికిత్స నిర్వహించారు. అనంతరం ఎస్సై సాయికిరణ్, గ్రామస్తులు మనుబోతును అటవీశాఖ అధికారి మహేష్‌కు అప్పగించారు.

పొచ్చర జలపాతం



కనకాయి జలపాతం



కుంటాల జలపాతం




కడెం తీరం.. సోయగాల హోరం

ప్రకృతికి నిలయంగా.. నదీ పరీవాహకం

- గోదావరికి ఉపనదిగా...
- సాగుకు జీవ నదిగా..
- జలపాతాలకు నిలయం
- ఆదిలాబాద్ జిల్లా దక్షిణ కాశ్మీరంలో కడెం నది ఓ భాగం

కడెం నది
ప్రారంభం: ఉమార్దా(బి), ఆదిలాబాద్ జిల్లా
ముగింపు: బెల్లాల్ (పెద్దూరు) నిర్మల్ జిల్లా
పొడువు: 86కిలో మీటర్లు
నదిపై ప్రధాన సాగు నీటి ప్రాజెక్టు: కడెం ప్రాజెక్టు
జలపాతాలు: కుంటాల, పొచ్చర, కనకాయి, బంగ్రేవ్, గాయత్రి


కడెం ప్రాజెక్ట్ అందాలు

బజార్‌హత్నూర్: ఆదిలాబాద్ జిల్లా అడవులు, నదులు, జలపాతాలు, పచ్చదనం ప్రకృతి రమణీయతకు ప్రసిద్ధి. జిల్లాను దక్షిణ కాశ్మీర్‌గా పిలుస్తారు. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాకు దక్షిణం వైపు గోదావరి నది, ఉత్తరం వైపు పెన్‌గంగా నది మధ్యలో కడెం నది పరవళ్లు తొక్కుతోంది. జిల్లాలో కడెం నది ప్రధానమైనది. కడెం నది కవ్వాల్ టైగర్ జోన్ పరిధిలో ప్రవహించడంతో ఎక్కువ భాగం అడవుల గుండా ప్రవహిస్తూ, రాళ్లపై సవ్వడులు చేస్తూ జలపాతాలు దూకుతూ గోదావరి నదిలో కలుస్తోంది. నది తీరం సాగుకు జీవం పోస్తుంది.

కడెం నదీ పరీవాహకం..
కడెం నది గోదావరి నదికి ఉపనది. ఇది కడెం రిజర్వ్ ఫారెస్ట్ కవ్వాల్ అభయారణ్యంలో ఉంది. ఆదిలాబాద్ జిల్లా బజార్‌హత్నూర్ మండలం గిరిజాయి గ్రామపంచాయతీ పరిధిలోని ఉమర్దా గ్రామం వద్ద మహారాష్ట్ర, తెలంగాణ సరిహద్దు అటవీ ప్రాంతంలో ప్రారంభవుతోంది. 86 కిలో మీటర్ల పొడువున ఆగ్నేయ దిశలో ప్రవహించి కడెం మండలం బెల్లాల్ గ్రామం వద్ద గోదావరి నదిలో కలుస్తుంది.


నది ప్రారంభమయ్యే స్థలం

కడెం నది ప్రయాణం ఇలా..
మండలంలోని ఉమార్దా వద్ద ప్రారంభమై గిర్నూర్ గ్రామపంచాయతీ పరిధిలోని కనకాయి అటవీ ప్రాంతంలో నది 17కిలో మీటర్ల వద్ద కనకాయి జలపాతం, బంగ్రేవ్ జలపాతం, గొలుసుల గుండం ఉన్నాయి. మరో 12కిలో మీటర్ల ప్రయాణం తర్వాత నేరడిగొండ మండలంలో కుమారి వద్ద ప్రవేశిస్తుంది. కడెం నదికి ఉపనది అయిన బోథ్ మండలంలోని పెద్ద వాగుపై పొచ్చర జలపాతం ఉంది. కుమారి గ్రామ సమీపంలోనే కడెం నదిపై రాష్ట్ర ప్రభుత్వం 5.30 టీఎంసీల నీటి సామర్థ్యంతో, మూడు మెఘవాట్ల విద్యుత్ ఉత్పత్తి కోసం రూ.1100 కోట్ల నిధులతో కుప్టీ ప్రాజెక్ట్ నిర్మాణానికి ప్రతిపాదనలు చేసింది. అక్కడి నుంచి నది 10కిలో మీటర్లు ముందుకు వెళ్లాక కడెం నదికి ఉపనది అయిన ఇచ్చోడ మండలంలోని గుండివాగుపై గాయత్రి జలపాతం ఉంది. ఈ జలపాతం వద్ద జాతీయ స్థాయి ట్రెక్కింగ్ క్రీడా పోటీలు నిర్వహిస్తుంటారు. కడెం నది అక్కడి నుంచి మరో 11కిలో మీటర్లు ముందుకు వెళ్లిన తర్వాత నేరడిగొండ మండల పరిధిలో కవ్వాల అభయ అరణ్యం (టైగర్ జోన్)లో రాష్ట్రంలోనే అత్యంత ఎత్తైన, ప్రసిద్ధి చెందిన కుంటాల జలపాతం ఉంది. ఈ జలపాతానికి జులై నుంచి జనవరి వరకు రోజుకు వేల సంఖ్యలో పర్యాటకులు వస్తారు. అక్కడి నుంచి 80కిలో మీటర్లు ప్రయాణిస్తే కడెం మండల కేంద్రం సమీపంలో కడెం ప్రాజెక్టు (కడెం ఆది నారాయణరెడ్డి ప్రాజెక్టు)ను నిర్మించారు.

ఉప నదులు సమాహారం..
కడెం నది ఆదిలాబాద్, నిర్మల్ జిల్లాల పరిధిలో ఉంది. నది పరివాహకం బజార్‌హత్నూర్, ఇచ్చోడ, బోథ్, నేరడిగొండ, సిరికొండ, కడెం, పెంబి మండలాల పరిధిలో ఉంది. కడెం నదికి బలివాగు, గాణగాపూరం వాగు, బతుకమ్మ వాగు, సిక్కుమాను వాగు, పలుకేరు వాగు, దట్కి వాగు, రాగిదోబ, గుండివాగు, వాంకిడి వాగు, పెద్దవాగు, క్రమపద్ధ వాగులు ఉపనదులు ఉన్నాయి. ఈ వాగుల పరిధిలో చెరువులు, నీటికుంటలు అనేకం.


కడెం సాగునీటి ప్రాజెక్టు

కడెం సాగునీటి ప్రాజెక్టు
కడెం ప్రాజెక్టు (కడెం ఆది నారాయణరెడ్డి ప్రాజెక్టు)ను 1958–1965 మధ్యకాలంలో నిర్మించారు. ఆయకట్టు నిర్మల్, మంచిర్యాల జిల్లాల పరిధిలో 68వేల ఎకరాలు సాగవుతోంది. ఈ ప్రాజెక్టులో గోదావరి నదిపై గల శ్రీరామసాగర్ ప్రాజెక్టు నుంచి సరస్వతి కాలువ ద్వారా కడెం రిజర్వాయర్‌లో నీటిని నింపుతారు. నీటి పంపిణీకి రెండు ప్రధాన కాలువలు ఉన్నాయి. ఎడమ కాలువ పొడువు 76.8 కిలోమీటర్లు, కుడి కాలువ పొడువు 8కిలో మీటర్లు.


కడెం ప్రాజెక్ట్‌పై భాగంలో..

జలపాతాల నిలయం..
రాష్ట్రంలో ఏ ప్రాంతంలో లేనటువంటి ప్రకృతి రమణీయత కడెం నది పరీవాహక ప్రాంతంలో ఉంది. ఇక్కడ ఉన్న జలపాతాలు హైదరాబాద్‌తో పాటు ఇతర రాష్ట్రాల పర్యాటకుల్ని మంత్రముగ్ధుల్ని చేస్తాయి. బజార్‌హత్నూర్ మండలంలోని కనకాయి, బంగ్రేవ్ జలపాతాలు, బోథ్ మండలంలోని పొచ్చర, ఘన్‌పూర్ జలపాతాలు, ఇచ్చడ మండలంలోని గాయత్రి జలపాతం, నేరడిగొండ మండలంలోని కుంటాల, కొరిటికల్ జలపాతాలు చూపరులను ఇట్టే కట్టిపడేస్తాయి.


గాయత్రి జలపాతంపై ట్రెక్కింగ్ చేస్తున్న క్రీడాకారులు

పొదుపు చేస్తేనే ఆర్థికాభివృద్ధి


మాట్లాడుతున్న టీజీబీ చైర్మన్ శోభ, పక్కన డీఆర్‌డీవో విజయలక్ష్మి


స్వయం సహాయక మహిళలకు చెక్కు ఇస్తున్న టీజీబీ చైర్మన్ శోభ, డీఆర్‌డీవో విజయలక్ష్మి

- పొదుపులో మహిళలు ఆదర్శం
- టీజీబీ రాష్ట్ర చైర్మన్ శోభ

కుంటాల: పొదుపు చేస్తేనే మహిళలు ఆర్థికంగా ఎదుగుతారని, పొదుపుతో మహిళలు ఆదర్శంగా నిలవడం గర్వకారణమని టీజీబీ రాష్ట్ర చైర్మన్ శోభ, డీఆర్‌డీవో విజయలక్ష్మి పేర్కొన్నారు. మంగళవారం మండలంలోని కల్లూర్ సాయిబాబా ఆలయ ఆవరణలో జిల్లాలోని 833 స్వయం సహాయక సంఘాల మహిళలకు రూ.50 కోట్ల రుణ వితరణ చేసి మాట్లాడారు. ప్రతీ మహిళా పొదుపు సంఘంలో నెలసరి పొదుపు చేస్తే స్వయం ఉపాధి పొందవచ్చని సూచించారు. స్వయం సహాయక సంఘాల మహిళల జీవనోపాధికి తమ వంతుగా కృషి చేస్తున్నామన్నారు. మహిళలను ప్రోత్సహించేందుకు వ్యవసాయ, వ్యాపార, విద్యారుణాలు అందిస్తున్నట్లు తెలిపారు. ప్రతీ ఒక్కరు పొదుపు అలవర్చుకుంటే వారి కుటుంబాలు సుఖ సంతోషాలతో ఉంటాయన్నారు. పొదుపు చేస్తున్న స్వయం సహాయక సంఘాల మహిళలను అభినందించారు. ఆర్‌ఎం బీవీఎస్ రామరావు, అడిషనల్ డీఆర్‌డీవో గోవింద్‌రావు, డీపీఎంలు జ్ఞాను, విజయలక్ష్మి, మేనేజర్లు రాంచందర్, సంతోష్, శ్రీకాంత్, ఏపీఎం భోజన్న ఉన్నారు.

తప్పిపోయిన వ్యక్తి ఆచూకీ లభ్యం


కుటుంబీకులకు అప్పగిస్తున్న పోలీసులు

ఆదిలాబాద్‌టౌన్: ఆదిలాబాద్ పట్టణం టూటౌన్ పోలీసుస్టేషన్ పరిధిలోని చిల్కూరి లక్ష్మినగర్‌కు చెందిన మూగ, చెవిటి వ్యక్తి అక్రమ్ ఆచూకీ లభ్యమైనట్లు సీఐ అశోక్ తెలిపారు. ఆయన కథనం ప్రకారం .. రెండు రోజుల క్రితం ఇంటి నుంచి వెళ్లి తిరిగి రాలేదు. అతడు రైలులో ఎక్కి గుర్తుతెలియని చోటికి వెళ్లాడు. తిరిగి సోమవారం రాత్రి ఆదిలాబాద్ రైల్వే స్టేషన్‌కు రావడంతో పోలీసులు గుర్తించి అతడి కుటుంబీకులకు అప్పగించారు.

విద్యుత్‌షాక్‌తో మేక మృతి

తాంసి: మండల కేంద్రానికి సమీపంలోని విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ వద్ద మంగళవారం విద్యుత్‌షాక్‌తో మేక మృత్యువాత పడింది. పశుగ్రాసం కోసం పంట చేల వైపు మేకలను తీసుకెళ్లే క్రమంలో ట్రాన్స్‌ఫార్మర్‌కు మేక తగలడంతో విద్యుత్ షాక్‌కు గురై అక్కడికక్కడే మృత్యువాత పడింది. మృతి చెందిన మేక విలువ రూ.10వేలకు పైగా ఉంటుందని, పరిహారం అందించి ఆదుకోవాలని యజమాని రాజు కోరుతున్నాడు. పాఠశాల సమీపంలోని ఈ విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ తక్కువ ఎత్తులో ఉండడంతో విద్యుత్‌షాక్‌తో మేక మృత్యువాత పడిందని, పాఠశాల విద్యార్థులు కూడా ఇటు వైపు వచ్చే అవకాశం ఉందని, ప్రమాదం జరుగకముందే అధికారులు స్పందించాలని గ్రామస్తులు కోరుతున్నారు.

అనుమానాస్పదస్థితిలో చెరువులో చేపలు మృతి

దస్తురాబాద్: అనుమానాస్పదస్థితిలో మండల కేంద్రంలోని పెద్ద చెరువులోని చేపలు మంగళవారం మృతిచెందాయి. మత్స్యకారుల వివరాల ప్రకారం ... మండల కేంద్రంలోని పెద్ద చెరువులో మత్స్యకారుల సొసైటీ ఆధ్వర్యంలో యేటా చేపలను సాగు చేస్తుంటారు. రెండు రోజులుగా వర్షాలు కురువడంతో కొంత చెరువులోకి నీరు వచ్చి చేరింది. అయితే ఆ నీరు వచ్చే ప్రదేశంలో గుర్తు తెలియని వ్యక్తులు విషం కలిపి ఉంటారని ఆరోపించారు. ఈ చెరువులో యేటా 70,000 చేప పిల్లలను తెలంగాణ ప్రభుత్వం అందజేస్తుందని, గత రెండు సంవత్సరాల నుంచి చేపలను పెంచుతున్నామన్నారు. విష ప్రయోగంతో రెండు టన్నుల చేపలు చనిపోయాయని, ప్రభుత్వం మత్స్యకార సంఘ సభ్యులను ఆదుకోవాలని వేడుకుంటున్నారు.

అడవి తల్లికి 'తొలి' పూజ

- గిరిజన గూడేల్లో ప్రారంభమైన 'అకాడి' సంబురం
- ఊరూరా ఉత్సవాలకు శ్రీకారం
- అడవుల్లోనే వనభోజనాలు
- ఏత్మాసార్ పేన్‌కు పూజలు ప్రారంభం
- నాలుగు మాసాలపాటు కొనసాగింపు


తుడ్ర మోగిస్తున్న పెద్దలు

కెరమెరి(ఆసిఫాబాద్):సంస్కృతి, సంప్రదాయాలు, ఆచార వ్యవహారాలు కాపాడడంలో ఆదివాసీలు ముందుంటున్నారు. ఆషాఢమాసంలో ముందుగా వచ్చే పండుగ అకాడి. నెలవంక కనిపించడంతో అకాడి వేడుకలు ప్రారంభించి వారం రోజులపాటు నిర్వహిస్తారు. మంగళవారం పెద్దసాకడ గ్రామంతో పాటు ఉమ్మడి జిల్లాలోని ఆదివాసీ గూడేల్లో అకాడి పండుగ ప్రారంభించారు. పౌర్ణమి వరకూ వేడుకలు నిర్వహించనున్నారు.

వనంలో పూజలు..
అకాడి వేడుకల్లో భాగంగా మంగళవారం పెద్దసాకడ గ్రామ పొలిమేరలో ఉన్న బాబ్రిచెట్టు వద్దకు వెళ్లారు. చెట్టుకింద ఉన్న రాజుల్‌పేన్ దేవుడికి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం లక్ష్మణరేఖ లాంటి ఒక గీత గీశారు. ప్రత్యేకంగా తయారు చేసిన తుడ్రను ఊదడంతో పశువులు గీతపై నుంచి అడవిలోకి పరిగెత్తాయి. అడవిలోని చెట్లు, ఆకులకు అకాడిపేన్ పూజ చేశాక ఆ ఆకులను ఇళ్లకు తీసుకెళ్లారు.

కోడితో జాతకం..
ఆదివాసీల ఆచార వ్యవహారాల్లో భాగంగా గ్రామ పటేల్ ఇంటినుంచి తెచ్చిన కోడిని దేవుడి ముందు ఉంచుతారు. దాని ముందు గింజలు పోసి జాతకం చెప్పించుకుంటారు. అనంతరం ఇంటినుంచి తెచ్చిన కోడిని బలిస్తారు. అక్కడే ఒకచోట వంటలు తయారు చేశారు.

తుడ్ర వాయింపు..
ఈ అకాడి పండుగల్లో మరో కొత్త కోణం ఉంది. అడవిలోకి వెళ్లిన పశువులు ఇళ్లకు చేరాలంటే తుడ్ర వాయించాలని ఆచారం. పశువుల కాపరుల వద్ద ఈ తుడ్ర ఉంటుంది. పశువులు ఎక్కడికి వెళ్లినా ఈ తుడ్ర వాయిస్తే తిరిగి వస్తాయని వారి నమ్మకం. నెల రోజుల పాటు తుడ్ర వాయిస్తూనే ఉంటారని పలువురు కటోడాలు చెబుతున్నారు.

ఏత్మాసార్ పేన్‌కు పూజలు!
అకాడి అనంతరం గ్రామంలోకి చేరుకున్న ఆదివాసీలు ఏత్మాసార్ పేన్‌కు పూజలు చేశారు. నాలుగు మాసాలపాటు ఈ పూజలు కొనసాగనున్నాయి. గ్రామంలో ఉన్న ప్రజలతో పాటు పశువులు క్షేమంగా ఉండాలని, పంటలు బాగా పండాలని మొక్కుకుంటారు. అకాడి అనంతరం నాగుల పంచమి, జామురావూస్, శివబోడి, పొలాల అమావాస్య, బడిగా, దసరా, దీపావళి పండుగలు చేస్తారు.

సంప్రదాయబద్ధంగా అకాడీ పూజలు
సిరికొండ: మండలంలోని కోసుగూడ గిరిజనులు మంగళవారం తమ సంప్రదాయపద్ధతిలో అకాడీ పండుగను నిర్వహించుకున్నారు. గ్రామస్తులంతా కలిసి గ్రామ సమీపంలోని అడవిలోకి వెళ్లి తమ గిరిజన దేవుళ్లతో పాటు ప్రకృతికి ప్రత్యేకంగా పూజలు చేశారు. కార్యక్రమంలో గ్రామ పటేల్ కుమరం రావుజీ, దేవరి కుమురం జంగుబాపు, మహజన్ కోరేంగ వాగు, కారోబారి కుమురం కోసేరావ్, కుమురం యాదవ్‌రావు, లింబరావ్ ఉన్నారు.


ఆకిపూన్ వద్ద భక్తులు


సిరికొండ: పూజల్లో గిరిజనులు

అనాదిగా వస్తున్న ఆచారం



అకాడి పండుగ అనాది నుంచి వస్తున్న ఆచారం. ఈ పండగ చేశాకే అన్ని పండుగలు చేసుకుంటాం. ఈ సందర్భంగా రాజుల్ దేవతకు ప్రత్యేక పూజలు నిర్వహిస్తాం. ఇది ఆదివాసీల ఆచారం.
– కుర్సెంగ సోంజి, పెద్దసాకడ

ఆయురారోగ్యాలతో ఉండాలని..



ప్రజలతో పాటు, పశుపక్షాదులు ఆయురారోగ్యాలతో ఉండాలని రాజుల్ దేవతను కొలిచే పండుగ ఇది. ఇందులో భాగంగానే కోడి పంచాంగం చెబుతుంది. దాని ప్రకారమే సంవత్సర కాలమంతా నడవాల్సి ఉంటుంది.
– పెందోర్ మోతీరాం, ఎంపీపీ, కెరమెరి

ఏత్మాసార్ పేన్‌కు పూజలు



అకాడి పూజల అనంతరం ఏత్మాసార్ పేన్‌కు పూజలు చేస్తాం. నాలుగు మాసాల పాటు ఈ పూజలు చేయాల్సి ఉంటుంది. గుస్సాడీ దీక్ష స్వీకరించే వారు ఈ రోజు మొక్కుకుంటారు. దసరా, దీపావళి తదితర పండుగలు చేస్తాం. వన భోజనం ఐకమత్యాన్ని తెలియజేస్తుంది.
– ఆత్రం బొజ్జిరావు, సర్‌మేడి, చౌపన్‌గూడ